ప్రచురణార్హమైన

భారతదేశ సర్వోన్నత న్యాయస్థానము

సివిల్ అప్పిలేట్ జూరిస్డిక్షన్

సివిల్ అప్పీల్ నం.1715/2023

వీరేంద్ర సింగ్ ...అప్పీల్ దారుడు

వర్సెస్

అదనపు కమీషనర్ మరియు ఇతరులు. ...ప్రతివాదులు

# తీర్పు

గౌరవ న్యాయమూర్తి సంజయ్ కిషన్ కౌల్.

కేసు వాస్తవ విషయాలు:

1. అప్పీలుదారుడు 08.01.2020 న ధులే జిల్లా , షింధ్ఖేడా తాలూకా , చిమ్థానే సమితికి సంబంధించిన ఎన్నికలలో గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి జిల్లా పరిషత్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అయితే , ఈ ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థి అయిన మూడవ ప్రతివాది చేసుకున్న ధరఖాస్తు మీద నాసిక్ డివిజనల్ కమిషనర్ గారు 08.11.2021 ఉత్తర్వు ద్వారా అప్పీలుదారుడు ఈ పదవికి అనర్హుడిగా ప్రకటించబడ్డారు.

2. 3 వ ప్రతివాది , మహారాష్ట్ర జిల్లా పరిషత్తులు మరియు పంచాయతీ సమితుల చట్టము, 1961 (ఇక నుండి “ఈ చట్టం” గా వ్యవహరించబడుతుంది ) సెక్షన్ 16 (1) (ఐ) తో కలిపి చదవబడిన సెక్షన్ 40 కింద దాఖలు చేసిన తన ధరఖాస్తులో అప్పీల్దారుడు తాను ఎన్నికైన పదవిని అక్రమ వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనలు పొందేందుకు దుర్వినియోగం చేయడం వల్ల ఆ పదవికి అనర్హుడని ఆరోపించారు. ఈ ఆర్థిక ప్రయోజనం , 26.01.2020 న ఆరవే ఫాటా నుండి మౌజె ఆరవే వరకు రహదారిని మరమ్మతు చేయడానికి మరియు తారు చేయడానికి ఆరవే గ్రామ పంచాయతీ వారు తీర్మానాన్ని ఆమోదించడంలో తాను పోషించిన పాత్ర కారణంగా, అప్పీలుదారునికి చేకూరినదని పేర్కొనబడింది. ఆ తరువాత, అప్పీలుదారు సభ్యుడుగా ఉన్న ధులే జిల్లా పరిషత్ 05.06.2020 న

"ఈ చట్టము" సెక్షన్ 125 కింద జిల్లా పరిషత్ అధికారాలను వినియోగించడం ద్వారా రూ. 15 లక్షలు ప్రాజెక్టు విలువతో ఈ ప్రాజెక్ట్ ను ఆమోదించి పరిపాలనా పరమైన సమ్మతిని మంజూరు చేసింది.

3. పై మంజూరుకు అనుగుణంగా, ఆరవే గ్రామ పంచాయతీ 29.06.2020 న ఇ–టెండర్ ప్రక్రియను ప్రారంభించింది. అప్పీలుదారు యొక్క కుమారుడు దీనికి దరఖాస్తు చేసి, మరో ఇద్దరు దరఖాస్తుదారులపై టెండర్ ప్రక్రియలో విజయం సాధించాడు. ఆ తరువాత, 21.07.2020 న మౌజే ఆరవే వద్ద రహదారిని మరమ్మతు చేయడానికి ఆరవే గ్రామ పంచాయతీ అతనికి రూ.14,62,871/– కు వర్క్ ఆర్డర్ జారీ చేసింది.

4. పైన పేర్కొన్న నేపథ్యంలో , అప్పీలుదారు తను ఎన్నికైన పదవిని దుర్వినియోగం చేశారని అందువల్ల అనర్హుడని 3 వ ప్రతివాది ఆరోపించారు. "ఈ చట్టము" యొక్క సెక్షన్ 16 (1) (ఐ) తో కలిపి చదవబడిన సెక్షన్ 40 కింద దరఖాస్తు దాఖలు చేయబడింది. సూచన కోసం, ఈ నిబంధనలు క్రింద ఉటంకించబడ్డాయి:

"16. **అనర్హతలు**–(1) సబ్ సెక్షన్ (2) లోని నిబంధనలుకు లోబడి, ఒక వ్యక్తి కౌన్సిలర్ గా ఎన్నుకోబడుటకు మరియు కౌన్సిలర్ గా ఉండుటకు అనర్హుడు అవుతాడు–

...... ...... ......

(i) జిల్లా పరిషత్ ఆదేశాల మేరకు లేదా జిల్లా పరిషత్ ద్వారా లేదా దాని తరపున చేసిన ఏదైనా పనిలో తనకు లేదా తన భాగస్వామి ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఏదైనా వాటా లేదా ఆసక్తి ఉంటే;

"40. (1) సెక్షన్ 62 లోని సబ్ సెక్షన్ (2) లోని నిబంధనలుకు లోబడి, ఎవరైనా కౌన్సిలర్ తన పదవీకాలంలో –

XXXX XXXX XXXX XXXX

[(2) ఈ విభాగం కింద ఖాళీ ఏర్పడిందా అనే విషయమును కమిషనర్ స్వయంగా గానీ లేదా ఎవరైనా తనకు చేసిన దరఖాస్తుపై గానీ లేవనెత్తినట్లయితే, కమిషనర్ అటువంటి దరఖాస్తు అందిన తేదీ నుండి తొంభై రోజులలోపు (వీలైనంత వరకు) విషయమును నిర్ణయించాలి మరియు దానిపై

అతని నిర్ణయం అంతిమంగా ఉండాలి. ఖాళీ ఏర్పడిందని కమిషనర్ నిర్ణయించే వరకు, కౌన్సిలర్ కౌన్సిలర్ గా ఆ పదవిలో కొనసాగడానికి అయోగ్యత ఉండదు.

కానీ ఏ కౌన్సిలర్కు అయినా వాదనలు వినడానికి సహేతుకమైన అవకాశం ఇవ్వకుండా అతనికి వ్యతిరేకంగా ఎటువంటి నిర్ణయం ఇవ్వకూడదు.]"

5. 08.11.2021 నాటి ఉత్తర్వు ప్రకారం డివిజనల్ కమిషనర్ 3వ ప్రతివాది దాఖలు చేసుకున్న అనర్హత అప్పీల్ నెం. 01/2021ను ఆమోదించినారు. ధులే జిల్లా పరిషత్ పరిధిలోకి వచ్చే చిమ్ఠానే సమితి లో ఆరవే గ్రామ పంచాయతీ ఉన్నందున, అప్పీలుదారు దానిపై ప్రభావం చూపగలడని స్పష్టంగా తెలుస్తుందని డివిజనల్ కమిషనర్ పేర్కొన్నారు. ధులే జిల్లా పరిషత్ పరిధిలోకి వచ్చే ఇతర సమితుల నుండి అప్పీలుదారు కుమారుడికి వర్క్ ఆర్డర్లు ఇచ్చినట్లు ఎటువంటి సాక్ష్యము లేవని, అందువల్ల దుర్వినియోగం గురించి ప్రాథమికంగా అనుమానం ఉందని, అందువలన "ఈ చట్టము" సెక్షన్ 16 (1) (i) కింద అప్పీలుదారుని అనర్హులుగా ప్రకటించాల్సిన అవసరం ఉందని కూడా గమనించబడింది. ఈ దశలో, అప్పీలుదారు యొక్క వ్రాతపూర్వక వివరణను అతని వాదనగా పరిగణించిన తరువాత డివిజనల్ కమిషనర్ యొక్క ఉత్తర్వు ఇవ్వబడిందని కూడా గమనించవచ్చు, ఎందుకంటే అప్పీలుదారు అభ్యర్థన మేరకు ఈ విషయం అప్పటికే అనేక సందర్భాల్లో వాయిదా పడింది.

6. అప్పీలుదారుడు రిట్ పిటిషన్ నెం. 12526/2021 ద్వారా హైకోర్టు ముందు తన అనర్హతను సవాలు చేశారు. హైకోర్టు ముందు ఆయన చేసిన వాదములను ఈ క్రింది విధంగా స్పష్టీకరించవచ్చు:

> (ఎ) ఈ రహదారి మరమ్మతు పనులు వేరే చట్టం అనగా మహారాష్ట్ర గ్రామ పంచాయతీల చట్టము, 1959 (' వీపీ చట్టము') కింద నియంత్రించబడే గ్రామ పంచాయతీ ఆదేశాల మేరకు జరుగుతున్నందున, "ఈ చట్టము" ఈ కేసుకు వర్తించదు.
>
> (బి) ఒక వేళ "ఈ చట్టము" వర్తిస్తుందని భావించినప్పటికీ, జిల్లా పరిషత్ స్వయంగా పనిని చేపట్టినట్లయితే మాత్రమే అనర్హతలు సంభవిస్తాయని సెక్షన్ 16 (1) (ఐ) యొక్క భాష సూచిస్తుంది. అయితే, ప్రస్తుత కేసులోని వాస్తవాలను బట్టి చూస్తే జిల్లా పరిషత్ కేవలం పర్యవేక్షక పాత్ర మాత్రమే పోషించింది.

(సి) అప్పీలుదారుకు తన కుమారుడి ఆర్థిక వ్యవహారములుపై 'ఆసక్తి' లేదు, ఎందుకంటే అతనికి స్వతంత్ర వ్యాపారం ఉంది మరియు వీరిద్దరూ కలిసి నివసించడం కూడా జరగడం లేదు;

(డి) డివిజనల్ కమిషనర్ అప్పీలుదారుడికి తన వాదనలు వినిపించడానికి అవకాశం ఇవ్వనందున అనర్హత ఉత్తర్వు ఇవ్వడంలో సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన జరిగింది.

7. అయితే 17.11.2021 నాటి ప్రస్తుత వివాదాస్పద తీర్పు ప్రకారం పైన పేర్కొన్న పిటిషన్లను హైకోర్టు తిరస్కరించింది. ఈ క్రింది నిర్ణయాల ఆధారంగా ఈ తీర్పు ఇవ్వబడినది:

ఎ. ఈ చట్టము సెక్షన్ (16) (1) (ఐ) విస్తృత పరిధిలో చెప్పబడింది. ఇది జిల్లా పరిషత్ యొక్క ఏ పనిలోనూ కౌన్సిలర్ నకు ఎటువంటి ఆసక్తి ఉండకూడదని ఆదేశించడమే కాకుండా, జిల్లా పరిషత్ ఆదేశాల మేరకు చేసే పనులపై కూడా అటువంటి కౌన్సిలర్ నకు యే విధమైన ఆసక్తి ఉండకూడదని కూడా నిర్దేశిస్తున్నది . ప్రస్తుత వాస్తవ దృష్టాంతంలో, ఈ పనిని జిల్లా పరిషత్ 'ఆదేశించింది', ఇది ఈ నిబంధన పరిధిలోనికి రావడానికి సరిపోతుంది. 09.06.2020 నాటి ఉత్తర్వు ప్రకారం రహదారి మరమ్మతు పనులను జిల్లా పరిషత్ డిప్యూటీ ఇంజనీర్ పర్యవేక్షణలో చేపట్టాలని జిల్లా పరిషత్ గ్రామ పంచాయతీని ఆదేశించింది. జిల్లా పరిషత్ ఆదేశాలకు అనుగుణంగా రహదారిని అభివృద్ధి చేస్తున్నట్లు జిల్లా పరిషత్ కార్యనిర్వాహక ఇంజనీర్, తేదీ 28.10.2021 న ఇచ్చిన సమాచారం కూడా పేర్కొంది, నిధులను పంపిణీ చేసిన ఏజెన్సీ కూడా జిల్లా పరిషత్తే.

బి. అప్పీలుదారు మరియు అతని కుమారుడు కలిసే నివసిస్తున్నారు అనే దానిపై డివిజనల్ కమిషనర్ ఆమోదయోగ్యమైన నిర్ణయానికి వచ్చారు.అప్పీలుదారు యొక్క ఏకైక సాక్ష్యము రేషన్ కార్డు, ఇది అతని కుమారుడు తన అమ్మమ్మతో కలిసి నివసించినట్లు చూపించింది.అయితే ఇది కుమారుడి ఆర్థిక స్వాతంత్ర్యానికి ఖచ్చితమైన రుజువు కాదు. ఏదేమైనా, ఈ విషయాలు నిజానికి న్యాయస్థానం యొక్క రిట్ అధికార పరిధిలో ఉండకపోవచ్చని అభిప్రాయపడడం జరిగింది.

సి. అన్ని సంబంధిత వాస్తవాల సమాచారం ఇప్పటికే డివిజనల్ కమిషనర్ ముందు ఉన్నందున అప్పీలుదారుకు తన వాదనను వినిపించే అవకాశం ఇవ్వాల్సిన

అవసరం లేదు. **ధరంపాల్ సత్యపాల్ లిమిటెడ్ v. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ ఎక్సైజ్, గౌహతి & అదర్స్** (1 (2015) 8 SCC 519) కేసు లో ఈ కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఈ చట్టపరమైన నిర్ధారణకు రావడం జరిగింది. పై కేసులో ఈ విధముగా చెప్పబడింది: పరిష్కారం యొక్క తుది ముగింపుపై అది ఎటువంటి ప్రభావం చూపనప్పుడు మరియు అది కేవలం లాంఛనప్రాయంగా ఉన్నప్పుడు వాదన వినాల్సిన అవసరం లేదు. పైగా , అప్పీలుదారుడి అభ్యర్థన మేరకు డివిజనల్ కమిషనర్ అనేక సందర్భాల్లో ఈ విషయాన్ని వాయిదా వేశారు. 08.10.2021 న అప్పీలుదారు స్వయంగా భౌతికంగా ఉన్నప్పటికీ, అతని న్యాయవాది అనారోగ్యం కారణంగా అప్పీలుదారుడు మళ్ళీ అభ్యర్థించినప్పుడు, అతనికి బహుళ అవకాశాలు మంజూరు చేయబడ్డాయని, అందువల్ల అతని వ్రాతపూర్వక వివరణను అతని సమర్పణలుగా పరిగణించాలని డివిజనల్ కమిషనర్ సరియైన నిర్ధారణకు వచ్చారు. మౌఖిక విచారణ కోసం అప్పీలుదారు చేసిన ప్రత్యేక దరఖాస్తును కూడా డివిజనల్ కమిషనర్ 01.11.2021 న ఇచ్చిన వివరణాత్మకమైన ఉత్తర్వు ద్వారా తిరస్కరించారు. దీనిని అప్పీలుదారు సవాలు చేసి ఉండలేదు.

**మా ముందు అప్పీలుదారు ఉంచిన కేసుః**

8. తన ధరఖాస్తులో తన కొడుకుకు ధులే జిల్లా పరిషత్ ద్వారా కాకుండా ఆరవే గ్రామ పంచాయతీ ద్వారా పని కేటాయించబడిందని అప్పీలుదారు ప్రాథమికంగా పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వ వెబ్ పోర్టల్లో ప్రచురించిన ఇ-టెండర్ ప్రక్రియ ద్వారా కేటాయింపు జరిగింది . జిల్లా పరిషత్ అధికారికంగా మంజూరు చేసినప్పటికీ, ఈ పనికి అప్పీలుదారు కుమారుడికి గ్రామ పంచాయతీ చెల్లింపులు చేసినది. రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్లోని 13వ నమోదుతో పాటు ఆర్టికల్ 243 (జి) కింద వారికి ఇచ్చిన అధికారాన్ని దృష్టిలో ఉంచుకుని, 20.07.2020 నాటి వర్క్ ఆర్డర్ కూడా గ్రామ పంచాయతీ ముద్ర కలిగి ఉంది.

9. ఈ చట్టము యొక్క 100, 100 (2) మరియు 125 సెక్షన్ల కింద ఈ కేటాయింపుకు జిల్లా పరిషత్ కేవలం పరిపాలనా, సాంకేతిక అనుమతులు మాత్రమే ఇచ్చిందని అప్పీలుదారు వాదించారు . అప్పీలుదారు కుమారుడు చేపట్టిన పనికి జిల్లా పరిషత్ నేరుగా చెల్లింపులు చేయలేదని పేర్కొన్నారు. ఈ విషయంలో , ఈ కేసులో 3 వ ప్రతివాది అయిన జిల్లా పరిషత్ యొక్క కౌంటర్ అఫిడవిట్ పై ఆధారపడటం జరిగింది.

10. రెండవ విషయం, అప్పీలుదారునకు తన కుమారుడి వ్యాపారంలో వ్యక్తిగత ఆసక్తి లేదని, వారు కలిసి నివసించడం లేదని కూడా వాదించారు. కేవలం ఒక మున్సిపల్ కమిటీ ఉద్యోగితో ఎన్నికల అభ్యర్థికి ఉన్న బంధుత్వం మాత్రమే అభ్యర్థిని ఎన్నికల్లో నిలబడటానికి అనర్హుడిని చేయదని, **గులాం యాసిన్ ఖాన్ వర్సెస్ శ్రీ సాహెబ్రావ్ యశ్వంత్రావ్ వాలాస్కర్ & అదర్స్** (AIR 1966 SC 1339) కేసులో ఈ న్యాయస్థానం చెప్పిన తీర్పుపై ఆధారం ఉంచబడింది.

11. మూడవ విషయం, అప్పీలుదారుని అనర్హులుగా ప్రకటించేటప్పుడు డివిజనల్ కమిషనర్ సహజ న్యాయ సూత్రాలను పాటించలేదని వాదించారు. **రవి యశ్వంత్ భోయిర్ v. జిల్లా కలెక్టర్, రాయ్గడ్ & అదర్స్** ( (2012) 4 SCC 407) కేసులో ఈ కోర్టు చెప్పిన సూత్రం ప్రకారం దుష్ప్రవర్తన ఆరోపణలపై తగు విచారణ జరపకుండా ఎన్నికైన ప్రతినిధిని అతని పదవి నుండి తొలగించరాదని వాదించారు. డివిజనల్ కమిషనర్ వద్ద విచారణలో, అప్పీలుదారు తన న్యాయవాది అనారోగ్యంతో ఉన్నందున ఆ రోజు వెసులుబాటు కోసం అభ్యర్థించారు. కానీ ఆ అభ్యర్థన అసమంజసమైనదిగా తిరస్కరించబడింది.

**అప్పీలుదారుడి దావాకు 3వ ప్రతివాది యొక్క ప్రతిస్పందన**:

12. జిల్లా పరిషత్తుల పనితీరులో నిజాయితీని తీసుకురావడం "ఈ చట్టము" సెక్షన్ 16 యొక్క లక్ష్యం అని నొక్కి చెప్పడానికి 3వ ప్రతివాది యొక్క న్యాయవాది ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో, ఈ విధంగా చెప్పడం జరిగింది (ఎ) జిల్లా పరిషత్ ఆదేశాల మేరకు చేసిన పని; (బి) జిల్లా పరిషత్తుతో ఏదైనా ఒప్పందంలో చేసిన పని లేదా (సి) జిల్లా పరిషత్ ద్వారా లేదా తరపున చేసిన పని అనే మూడు వర్గాలను పొందుపరచడానికి, "ఈ చట్టము" సెక్షన్ 16 (1) లోని సంబంధిత ఉప-సెక్షన్ (ఐ) యొక్క విస్తృత పరిధిని స్థిరీకరించాలని కోరారు.

ప్రస్తుత కేసులో , జిల్లా పరిషత్ ఆదేశాల మేరకు పని జరిగింది, అలాగే జిల్లా పరిషత్ ద్వారా చెల్లింపు కూడా జరిగింది. అందువల్ల ఇందులోని వాస్తవ విషయాలు "ఈ చట్టము" సెక్షన్ 16 (1) (ఐ) పరిధిలోకి రావడం వల్ల, అనర్హత ఉన్నదని స్పష్టమైనది అని తెలిపారు .

13. ఈ కేసులోని వాస్తవాల ప్రకారం అప్పీలుదారు 2020 జనవరిలో ఎన్నికయ్యారని, అయితే అతని కుమారుడు ధులే జిల్లా పరిషత్ లో 20.02.2020 న కాంట్రాక్టర్ గా నమోదు చేయబడ్డాడని తెలుస్తున్నది. అప్పీలుదారు యొక్క కుమారుడికి ఇచ్చిన ఒప్పందం ఖచ్చితంగా పరోక్ష ప్రయోజన స్వభావం కలిగి ఉంది. ఇక్కడ , 26.01.2020 నాటి గ్రామ పంచాయతీ తీర్మానం యొక్క

అనువాదం చుట్టూ కూడా కొంత వివాదం ఉందని మనం గమనించవచ్చు. ఈ విషయం అప్పీలుదారుని కథనం ప్రకారం ఈ విధంగా ఉన్నది , "అలాగే, చెప్పిన పని ఎప్పుడు మంజూరు చేయబడినా మరియు ఎప్పుడు పూర్తి చేయబడినా, గ్రామ పంచాయతీ వారు ఈ పనిలోని పర్యవేక్షణ మరియు మరమ్మతుల కోసం అయ్యే ఖర్చులను భరించడానికి ఇష్టపూర్వకంగా సిద్ధపడుతున్నారని ఏకగ్రీవంగా ఆమోదించబడినది." కానీ, ఈ అంశం అసలు తీర్మానంలో లేనే లేదు అని 3 వ ప్రతివాది యొక్క వాదన. ఏదేమైనా, ఇది ఎలా జరిగి ఉన్నా , జిల్లా పరిషత్ ద్వారా గ్రామ పంచాయతీకి నిధులు రావడం మాత్రం జరిగింది , అవి రాష్ట్ర ప్రభుత్వం నుండి స్వీకరించబడ్డాయి. జిల్లా పరిషత్ తన కౌంటర్ అఫిడవిట్లో కూడా ఇదే వైఖరిని వహించింది.

14. **జెలియా ఎంజేవియర్ ఫెర్నాండెజ్ ఇ. గోన్సాల్వేస్ వర్సెస్ జోనా రోడ్రిగ్స్ & అదర్స్ ((2012) 3 ఎస్‌సిసి 188) కేసులోని తీర్పుపై 3వ ప్రతివాది ఆధారం ఉంచినారు.** ఈ కేసులో ఈ కోర్ట్ గులాం యాసిన్ కేసు ని విశ్లేషిస్తూ, ఆ కేసు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆర్థిక ప్రయోజనం ప్రాతిపదికన స్థానిక స్వపరిపాలన సభ్యుడి అనర్హతకు సంబంధించినది కాదని పేర్కొంది. జెలియా ఎమ్. జేవియర్ యొక్క కేసు గోవా పంచాయతీ రాజ్ చట్టం, 1994 లోని సెక్షన్ 10 గురించి పరిశీలన చేసినందున ప్రస్తుత కేసుకు సంబంధించి ఎక్కువ ఔచిత్యం కలిగి ఉందని 3 వ ప్రతివాది తరపున వాదించారు, ఇది "ఈ చట్టము" సెక్షన్ 16 (1) (i) కి సమానంగా ఉంది.

**మా అభిప్రాయం:**

15. అట్టడుగు స్థాయిలో స్థానిక స్వపరిపాలన, పరిపాలనను ప్రవేశపెట్టడం, రాష్ట్ర ప్రభుత్వ పనులు, అభివృద్ధి పథకాల అమలును జిల్లా పరిషత్తులకు అప్పగించడం అనే "ఈ చట్టం" యొక్క లక్ష్యంను మనం మొదటగా గమనించాలి. ఎన్నికైన ప్రతినిధుల అనర్హతకు ఈ చట్టము వీలు కల్పిస్తుంది. అధిక మొత్తాలలో ఆర్థిక బాధ్యతలతో కూడిన స్థానిక ఒప్పందాలలో పారదర్శకతను ఏర్పరచటానికి మరియు ఎన్నికైన ప్రతినిధులు అక్రమంగా ప్రభావితం చేసే అవకాశాన్ని నివారించడానికి, సమతుల్యతను సాధించడానికి వీలు కల్పించే విధానాన్ని ఈ అధిశాసనం ఏర్పరుస్తుంది.
ఎన్నుకోబడిన ప్రతినిధులను స్వల్ప కారణాల వల్ల అనర్హులుగా చేయకూడదు అనడంలో సందేహం లేదు. ఏదేమైనా పారదర్శకత లక్ష్యాన్ని ఓడించే కార్య కలాపములు ప్రబలంగా ఉండటానికి అనుమతించకూడదు అనే చట్ట బద్ధమైన నిర్దేశాలకు మేము కట్టుబడి ఉన్నాము.

16. ఈ చట్టము సెక్షన్ 16 (1) (ఐ) కింద అనర్హతకు గల కారణాలను శాసన మండలి తన వివేకంతో విస్తృతంగా నిర్వచించింది. ఇందుకు గాను 'ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా', 'స్వయంగా

లేదా తన భాగస్వామి ద్వారా', 'జిల్లా పరిషత్ ఆదేశాల మేరకు లేదా', మరియు 'జిల్లా పరిషత్ ద్వారా లేదా తరపున' తో ఏదైనా ఒప్పందంలో చేసిన ఏదైనా పనిలో ఏదైనా వాటా లేదా ఆసక్తి', అనే పదజాలాన్ని ఉపయోగించడం ద్వారా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు స్వాభావికంగా, ఉపయుక్తంగా ఉండే ఆర్థిక ప్రోత్సాహాన్ని నిరుత్సాహపరిచే లక్ష్యంతో జిల్లా పరిషత్ పనితో కౌన్సిలర్ నకు ఏదైనా ఆర్థిక సంబంధం ఉందని చెప్పగల అన్ని సందర్భాలను ఇందులో చేర్చడానికి ప్రయత్నించారు.

17. ఇప్పుడు మనం ప్రస్తుతం వర్తించే పూర్వ న్యాయ నిర్ణయాలను గురించి పరిశీలిద్దాము. జెలియా ఎమ్. జేవియర్ కేసులో ఈ కోర్టు గులాం యాసిన్ కేసు యొక్క వర్తింపును విశ్లేషణ చేసింది. అనర్హత రావడానికి, ఏదైనా ఆసక్తి లేదా వాటా ఒప్పందంలోనే ఉండాలని, ఎన్నికల అభ్యర్థి మరియు మునిసిపల్ కమిటీ ఉద్యోగి మధ్య కేవలం బంధుత్వం మాత్రమే అనర్హతను నిర్ణయించడానికి సరిపోదని గులాం యాసీన్ కేసులో ఈ కోర్టు అభిప్రాయపడింది.

18. మా అభిప్రాయం ప్రకారం, ఈ రెండు కేసులు మన ముందు ఉన్న వాస్తవిక పరిస్థితులతో పోల్చి చూస్తే భిన్నమైన ప్రాతిపదికన నిలుస్తాయి. గులాం యాసిన్ కేసు సెంట్రల్ ప్రావిన్సెస్ అండ్ బెరార్ మునిసిపాలిటీస్ చట్టము 1922 లోని సెక్షన్ 15 (1) యొక్క వివరణకు సంబంధించినది, ఇది మునిసిపల్ కమిటీలో 'ఆసక్తి' ఉంటే ఎన్నికలలో నిలబడటానికి అభ్యర్థిని అనర్హులుగా ప్రకటించింది. అంతేకాకుండా, ఆ కేసులో న్యాయస్థానాన్ని ప్రభావితం చేసిన మరో అంశం ఏమిటంటే, ఆ కేసులో అప్పీలుదారుడు మహమ్మదీయ చట్టానికి లోబడి ఉన్నాడు, అందువల్ల అతను మరియు అతని కుమారుడు ఉమ్మడి 'ఆర్థిక ప్రయోజనాలను' కలిగి ఉన్న అవిభక్త కుటుంబ సభ్యులు అని చెప్పలేము. కానీ, జెలియా ఎమ్. జేవియర్ కేసులో, ఈ కోర్టు గమనించిన వాస్తవిక పరిస్థితిని బట్టి అందులోని అప్పీలుదారైన పంచాయతీ మెంబర్ యొక్క భర్త మార్కెట్ రుసుము వసూలు కోసం ఆ పంచాయతీతో ఒప్పందం కుదుర్చుకున్నందున, ఆమె అనర్హురాలిగా ప్రకటించబడింది. భర్త మరియు అప్పీలుదారు/భార్య యొక్క డబ్బు వ్యవహారములు పోర్చుగీస్ సివిల్ కోడ్, 1860 ద్వారా నియంత్రించబడుతున్నాయని తద్వారా జీవిత భాగస్వాముల ఆస్తి వివాహం తరువాత విలీనం చేయబడుతుంది అనే వాస్తవాన్ని కోర్ట్ గమనించింది . అందువల్ల, అప్పీలుదారు/భార్యకు తన భర్తకు పంచాయతీతో గల ఒప్పందంలో ఆర్థిక ఆసక్తి ఉందని నిర్ధారించబడింది.

19. ఈ వాస్తవమైన తేడాలు ఉన్నప్పటికీ, పైన పేర్కొన్న కేసుల నుండి స్వీకరించగల సాధారణ సూత్రం ఏమిటంటే, అనర్హత నిబంధనలను మితిమీరిన పరిమితము లేదా సంకుచితమైన పద్ధతిలో అర్థం చేసుకోవడం గురించి ఈ కోర్టు హెచ్చరించింది. రెండు సందర్భాల్లోనూ, మునిసిపల్

కమిటీలలో పరిపాలన యొక్క నిష్కలంకతను కాపాడుట అటువంటి నిబంధనలు యొక్క అభినందనీయకరమైన ఉద్దేశ్యం అని ఈ కోర్టు గుర్తించింది.

20. ప్రస్తుత కేసు యొక్క వాస్తవిక వివరాలను తిరిగి గమనించినప్పుడు , ఇది అప్పీలుదారు కుమారుడు ఇప్పటికే ఒప్పందంలో ఉన్న ఏదైనా పనిని నిర్వహిస్తున్న పరిస్థితి కూడా కాదని గమనించవచ్చు. అప్పీలుదారుని ఎన్నుకున్న వెంటనే అతని కుమారుడు కాంట్రాక్టర్ గా నమోదు చేయబడ్డాడు. ఆయనకు ఇక ఇతర కాంట్రాక్టులు ఏవీ లేవు.

అప్పీలుదారుడు సభ్యుడిగా ఉన్న జిల్లా పరిషత్ నుండి గ్రామ పంచాయతీకి నిధులు తరలిన ఏకైక కాంట్రాక్ట్ మాత్రమే అతనికి ఇవ్వబడింది. అప్పీలెంట్ ఎన్నికైన వెంటనే తన కుమారుడు తన చదువును పూర్తి చేసినందున కాంట్రాక్టర్ గా నమోదు చేయబడ్డాడని పేర్కొంటూ అప్పీలుదారు ఈ పరిస్థితిని సమర్థించడానికి ప్రయత్నించాడు. మా దృష్టిలో, ఈ వాస్తవం తన కుమారుడి వ్యాపారంలో అప్పీలుదారుడి ఆసక్తి గురించి మరింత అనుమానాలను లేవనెత్తుతుంది.

21. ధులే జిల్లా పరిషత్ తేదీ. 09.06.2020 న రహదారుల మరమ్మతు కోసం ఆరవే గ్రామ పంచాయతీకి పని ఉత్తర్వు జారీ చేసింది. ఈ పత్రం, మరియు జిల్లా పరిషత్ యొక్క కౌంటర్ అఫిడవిట్, రాష్ట్ర ప్రభుత్వం నుండి జిల్లా పరిషత్ కు, మరియు గ్రామ పంచాయతీకి నిధులు తరలినాయని వెల్లడిస్తున్నాయి. కానీ , అప్పీలుదారుడు నివేదించిన తేదీ. 26.01.2020 నాటి తీర్మానం యొక్క అనువాదం, గ్రామ పంచాయతీ ఈ ప్రాజెక్ట్ కోసం తన సొంత నిధులను ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఒక అభిప్రాయాన్ని ఇవ్వడానికి ప్రయత్నిస్తుంది. ఏదేమైనా, ఈ అనువాదాన్ని 3 వ ప్రతివాది తీవ్రంగా ప్రతిహతిస్తున్నారు. మా దృష్టిలో, జిల్లా పరిషత్ ద్వారా తేదీ. 09.06.2020 నాటి వర్క్ ఆర్డర్ జారీ చేయడం అనేది ఒప్పందంలో జిల్లా పరిషత్ యొక్క పర్యవేక్షక మరియు మంజూరు పాత్రను చూపిస్తుంది, ఇది పేర్కొన్న చట్టము సెక్షన్ 16 (1) (i) యొక్క విస్తృత పరిధిలోకి వస్తుంది.

22. అటువంటి ఆర్థిక లావాదేవీలలో నిజాయితీ అనేది మినహాయింపు కాకుండా నియమంగా ఉండాలని మేము నమ్ముతున్నాము. జిల్లా పరిషత్ స్వయంగా మంజూరు చేసిన ఒప్పందంలో తన కుమారుడు ప్రవేశించకుండా చూసుకోవడం తండ్రిగా అప్పీలుదారునికి చాలా బాధ్యత ఉన్నది . కొడుకు తన అమ్మమ్మతో కలిసి నివసిస్తున్నట్లు చూపించే రేషన్ కార్డు తప్ప, కొడుకు మరియు తండ్రి మధ్య నివాస విభజనను చూపించడానికి ఏమీ ఆధారం చూప బడలేదని దిగువ కోర్టులు కనుగొన్న

వాస్తవాన్ని మనం గమనించవచ్చు. ఇది ముఖ్యంగా కొడుకు తన విద్యను పూర్తి చేసినప్పుడిది అని సరిగ్గా గమనించబడింది.

23. అప్పీలుదారుకు తన వాదనలు వినిపించడానికి తగినంత అవకాశాలు కల్పించబడ్డాయని కూడా మనం గమనించవచ్చు. ముఖ్యంగా అప్పీలుదారుడి అనర్హత సమస్యను 3వ ప్రతివాది యొక్క దరఖాస్తులో పేర్కొన్న చట్టము సెక్షన్ 40 (2), డివిజనల్ కమిషనర్ 90 రోజుల్లో పరిష్కరించబడాలని నిర్దేశిస్తున్నప్పుడు, వాయిదా కోరడం జన్మ హక్కు కారాదు , కనుకనే డివిజనల్ కమిషనర్ అప్పీలుదారు యొక్క వ్రాతపూర్వక సమర్పణలను అతని ప్రతివాదనగా సరిగ్గా పరిగణించారు.

**నిశ్చయించి చెప్పిన అభిప్రాయం:**

24. పైన పేర్కొన్న అంశాల అనుగుణంగా , అప్పీల్ విఫలమైనది కనుక , తదనుగుణంగా ఇది కొట్టివేయబడాలని మేము అభిప్రాయపడుతున్నాము. అనర్హత పర్యవసానం ఈ తీర్పు తేదీ నుండి అమలులోకి వస్తుంది.

25. తదనుగుణంగా ఈ అప్పీలు కొట్టివేయబడింది, కక్షిదారులు తమ తమ ఖర్చులను తామే భరించాల్సి ఉంటుంది.

**...న్యాయమూర్తి.**
**[సంజయ్ కిషన్ కౌల్]**

**...న్యాయమూర్తి.**
**[అహ్సానుద్దీన్ అమానుల్లా]**

**...న్యాయమూర్తి.**
**[అరవింద్ కుమార్]**

**న్యూ ఢిల్లీ.**

**ఏప్రిల్ 17,2023.**